క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అరకులోయ టౌన్: అరకులోయ విద్యుత్ శాఖ పరిధిలోని అరకులోయ పట్టణంతో పాటు అరకు(అంజోడ) ఫీడర్‌లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఈఈ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. అరకులోయ టౌన్‌షిప్, అరకు(అంజోడ) 11 కేవీలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అరకులోయ, యండపల్లివలస, పానిరంగిని, రవ్వలగుడ, శరబగుడ గ్రామాల్లో విద్యుత్ స్తంభాల మార్పు కోసం సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

రక్తదానానికి ముందుకు రండి


గంగవరం తహసీల్దార్ సిహెచ్.శ్రీనివాసరావు

గంగవరం(అడ్డతీగల): రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని గంగవరం తహసీల్దార్ సిహెచ్.శ్రీనివాసరావు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 18న రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ తలపెట్టిన మహా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు రక్తదానం ప్రాధాన్యతను వివరించి ప్రోత్సహించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు.

గంగవరంలో ఇంకుడు గుంతల పనుల ప్రారంభం


ఇంకుడు గుంత తవ్వుతున్న పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణరావు

గంగవరం(అడ్డతీగల): గంగవరం మండలంలో శనివారం ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ప్రారంభించారు. గంగవరంలోని సర్పంచ్ కలుముల అక్కమ్మ ఇంటి వద్ద ఇంకుడు గుంత తవ్వకం పనులను ఎంపీడీవో లక్ష్మణరావు, ఉపాధి హామీ ఏపీవో ప్రకాశ్, తదితరులు పరిశీలించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గంగవరంలో 66 ఇంకుడు గుంతలు తవ్వుకోవడానికి అనుమతులు మంజూరు చేశామని ఎంపీడీవో తెలిపారు. మండల వ్యాప్తంగా మొదటి విడతలో 863 ఇంకుడు గుంతల నిర్మాణానికి ఏర్పాట్లు చేశామన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద స్వచ్ఛభారత్

జి.మాడుగుల: స్థానిక ఏపీఈపీడీసీఎల్ సబ్ సెంటర్ వద్ద ఏఈ వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. జి.మాడుగులలోని 33కేవీ విద్యుత్ సరఫరా యూనిట్, కార్యాలయం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సిబ్బంది శుభ్రం చేశారు. అనంతరం విద్యుత్ సిబ్బందితో ఏఈ వెంకటరమణ స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ


వృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న రెడ్ క్రాస్ ప్రతినిధులు

పాడేరు రూరల్: మండలంలో ఇరడాపల్లి పంచాయతీ చింతలగొందిలో జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు సొసైటీ కార్యదర్శి గౌరీశంకర్ ఆధ్వర్యంలో శనివారం 40 మంది వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నిరుపేదలకు సొసైటీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ లోహిదస్, సొసైటీ కోశాధికారి సూర్యారావు, సభ్యులు జయలక్ష్మి, మర్ల మణి పాల్గొన్నారు.

ముగిసిన రోడ్డు భద్రత మాసోత్సవాలు

పాడేరు : ప్రతి వాహనదారుడు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కోడి వాసు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా హుకుంపేట ఆర్టీవో కార్యాలయం నుంచి పాడేరు పట్టణం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వాహనదారులు ప్రతిరోజు కచ్చితంగా తమ వాహనాల కండిషన్‌ను తనిఖీ చేసుకోవాలన్నారు. హెవీ వెహికల్స్, ఆర్టీసీ డ్రైవర్లు ఎప్పటికప్పుడు దృష్టి లోపం రాకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రైవేటు జీపులు, ఆటోలు, ఇతర సర్వీసు వాహనాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, మితిమీరిన వేగంతో వాహనాలను నడపవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో డ్రైవర్లు, ద్విచక్ర వాహనచోదకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో రయ్.. రయ్..

- ఘాట్‌లో పూర్తయిన జాతీయ రహదారి పనులు
- విస్తరణతో ఘాట్ రోడ్డులో తగ్గిన ప్రమాదాలు
- వెడల్పయిన నాలుగు ఇరుకు మలుపులు
- వంతెనల నిర్మాణంతో వర్షా కాలంలోనూ రాకపోకలు


చింతాలమ్మ ఘాట్ రోడ్డులో కొండ చరియలు పడకుండా నిర్మించిన రక్షణ గోడ


పూర్తయిన చింతాలమ్మ ఘాట్ రోడ్డు విస్తరణ

కొయ్యూరు: ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆ గ్రామాల ప్రజలు మాత్రం వర్షాకాలంలో దశాబ్దాలుగా పడరాని పాట్లు పడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన జాతీయ రహదారి పనులు ఎట్టకేలకు పూర్తి చేసుకుని దశాబ్దాల కల నెరవేరిన వేళ ఆయా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ప్రమాదాలకు నెలవైన చింతాలమ్మ ఘా ట్ రోడ్డు రూపురేఖలు ప్రస్తుతం మారిపోయాయి. జాతీయ రహదారిలో 516/ఈ లో రోడ్డు విస్తరణ చేసి మలుపులను వెడల్పు చేయడంతో ప్రమాదాలు తగ్గాయి. దాదాపు ఏడాది కాలంగా ఘాట్‌రోడ్డు పనులు చేపట్టారు. కొద్ది రోజుల కిందట పూర్తయ్యాయి. సుమారు రెండు కిలోమీటర్ల పొడవైన చింతాలమ్మ ఘాట్‌రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలకు నిలయంగా ఉండేది. ఈ ఘాట్‌రోడ్డులో నాలుగు ఇరుకైన మలుపులను వెడల్పు చేశారు. మండలంలో 15 గ్రామాల మీదుగా 35 కిలోమీటర్ల పొడవైన రహదారి వెళ్తుంది. కాకరపాడు నుంచి కాట్రగెడ్డ వరకు రోడ్డు విస్తరణ పూర్తయింది. ఘాట్‌రోడ్డులో రాళ్లు పడతాయని భావించిన ప్రాంతాల్లో రక్షణ గోడలను నిర్మించారు. అయితే కొన్ని చోట్ల రోడ్డును ఆనుకుని పెద్ద చెట్లు ఉన్నాయి. వర్షా కాలంలో వర్షపు నీటికి మట్టి కరిగి ఆ చెట్లు పడిపోయే ప్రమాదం ఉంది. ఘాట్ ప్రారంభంలోను, చివరి మలుపు ముగిసేచోట చెట్లు పడే అవకాశం ఉంది. చింతాలమ్మ ఆలయం నుంచి రెండు పర్లాంగుల దూరం వరకు ఎడమ వైపు లోయను పూర్తిగా రాయితో నింపి వెడల్పు చేశారు.

రెండు వంతెనల నిర్మాణం పూర్తి


పూర్తయిన రామరాజుపాలెం వంతెన

రామరాజుపాలెం, నల్లగొండ వంతెనలు పూర్తి కావచ్చాయి. రామరాజుపాలెం వంతెనపై నుంచి వాహనాలు వెళ్తున్నాయి. నల్లగొండ వంతెనకు అప్రోచ్ రోడ్డు వేయాల్సి ఉంది. తాండవ ప్రాజెక్టుకు ప్రధాన ఇన్‌ఫ్లోగా ఉన్న తీగలమెట్ట కాలువ ఈ రెండు గ్రామాల నుంచి వెళ్తుంది. కిందటి సంవత్సరం వర్షాలకు కాలువ ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. చివరకు పొక్లెయిన్ బకెట్లలో రోగులను తరలించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఇలా వారం పాటు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు అ రెండు వంతెనలు పూర్తి కావడంతో వర్షా కాలంలోను రాకపోకలు యథావిధిగా సాగించవచ్చు.

ప్రమాదాలు తగ్గాయి..

ఘాట్ రోడ్డు విస్తరణ కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు తగ్గాయి. ఇది వరకు అలా ఉండేది కాదు. ఇరుకు మలుపులు వెడల్పయ్యాయి.

– నాగేశ్వరరావు, కాకరపాడు

సాఫీగా ప్రయాణం

ఇది వరకు కాకరపాడు నుంచి కృష్ణాదేవిపేట ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు రోడ్డు విస్తరణ కావడంతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. వాహనాలు ఎన్ని వచ్చినా ప్రమాదాలు జరిగే అవకాశం లేదు. ఘాట్ రోడ్డులో ఎత్తును తగ్గించడం మూలంగా లోడుతో వచ్చే వాహనాలు ఇబ్బంది లేకుండా వెవెళ్తున్నాయి.

– సతీష్, రాజేంద్రపాలెం

23వ రోజుకు ఏకలవ్య భూబాధితుల దీక్ష


శిబిరంలో దీక్ష చేస్తున్న భూబాధిత గిరిజనులు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల నిర్మాణానికి భూములు ఇచ్చిన గిరిజనులు తమకు న్యాయం చేయాలని కోరుతూ చేపట్టిన దీక్ష శనివారానికి 23వ రోజుకు చేరుకుంది. బాధిత గిరిజనులు రాంచందర్, డొంబు మాట్లాడుతూ ఉపాధి కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారని, ఇప్పటికి ఏడేళ్లు గడుస్తున్నా అతీగతీలేదన్నారు. దీక్ష చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎటువంటి స్పష్టత రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసి ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాందాసు, పరశురాం పాల్గొన్నారు.

విలీనం పేరిట చదువుకు దూరం చేయొద్దు

జి.మాడుగుల: మండలంలో బొయితిలి పంచాయతీ వనుకూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొన్ని తరగతుల విలీనానికి విద్యాశాఖ అధికారులు నివేదిక ఇవ్వడంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ పాఠశాలలో ఉన్న 3, 4, 5 తరగతులు గతంలో మాదిరిగానే కొనసాగించాలని, లేదంటే చాలా మంది గిరిజన పిల్లలు చదువుకు దూరమైపోతారని వాపోతున్నారు. విద్యార్థులు వేరే ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంఈవో బాబూరావుపడాల్‌ను వివరణ కోరగా.. ఈ పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీపంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చేర్పించి ఉచిత విద్య, వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. వనుకూరు పాఠశాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. మండలంలోని 28 పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించినట్టు ఆయన తెలిపారు.

ఖనిజాలపై పీసా కమిటీలకు విశేష అధికారాలు


మహిళలకు పీసా చట్టం అధికారాలపై వివరిస్తున్న అబ్జర్వర్ చక్రపాణి


శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో డేవిడ్, తదితరులు

అడ్డతీగల: సహజసిద్ధ ఖనిజాలపై పీసా కమిటీలకు విశేష అధికారాలు ఉన్నాయని పీసా కమిటీల శిక్షణ కార్యక్రమాల పరిశీలకుడు కె.చక్రపాణి అన్నారు. అడ్డతీగల మండల పరిషత్ కార్యాలయంలో 200 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు శనివారం పీసా చట్టం నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతరహా అటవీ ఉత్పత్తులు, వాటి ధరలు, అమ్మకాలపై నియంత్రణకు పీసా గ్రామ కమిటీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో భూమి అన్యాక్రాంతం కాకుండా నిర్ణయాలు తీసుకోవచ్చన్నారు. గ్రామసభలను బలోపేతం చేసుకోవాలన్నారు.

పాడేరు రూరల్: మండలంలో మండల పరిషత్, వెలుగు కార్యాలయాల్లో రెండు బ్యాచ్‌లుగా శనివారం పీసా కమిటీ సభ్యులతో పాటు ప్రజా ప్రతినిధులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డేవిడ్ మాట్లాడుతూ గిరిజన చట్టాలు, హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పీసా కమిటీ సభ్యులు అజయ్, రామకృష్ణ పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో రైతుల వివరాల నమోదు


చిన్నగెడ్డలో వివరాలను నమోదు చేయిస్తున్న వ్యవసాయాధికారి మధుసూదనరావు

చింతపల్లి: మండలంలోని గిరిజన రైతులంతా విధిగా తాము సాగు చేస్తున్న పంటలు, వారి పేర్లు, ఆధార్ వంటి వివరాలు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని చింతపల్లి మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు తెలిపారు. చిన్నగెడ్డ గ్రామంలో ఆయన శనివారం రైతు సేవా కేంద్రంలో రైతుల వివరాలను నమోదు చేశారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు


సేకరించిన చెత్తతో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని బోర్నగూడెం సమీప అడవుల్లో స్థానిక అటవీ అధికారులు శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అటవీ క్షేత్రాధికారి ఉషారాణి ఆధ్వర్యంలో సిబ్బంది రోడ్లకు ఇరువైపుల ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను పెద్ద మొత్తంలో తొలగించి శుభ్రం చేశారు. పర్యాటకులు విచ్చలవిడిగా సింగిల్ ప్లాస్టిక్‌ను ఉపయోగించి పర్యావరణానికి ముప్పు తీసుకురావద్దని ఉషారాణి కోరారు. దూమపానానికి పాల్పడవద్దని, అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎఫ్ఎస్‌వోలు రాము, బాలాజీ, అర్జున్, సుబ్బయమ్మ, ఎఫ్‌బీవోలు ప్రసాద్, ఆనంద్, నరేష్, రామకృష్ణ, నాగేశ్వరావు, ఈశ్వరి, లక్ష్మి బేస్ క్యాంపు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా నందీశ్వరుడి జాతర


థింసా నృత్యం చేస్తున్న గిరిజనులు

దుంబ్రిగుడ: మండలంలోని కొర్రా పంచాయతీ కేంద్రంలో నందీశ్వరుడి జాతర రెండు రోజు శనివారం కూడా ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మైదాన ప్రాంగణంలో థింసా నృత్యం ప్రదర్శన ఆకట్టుకుంది. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అర్జున్, ఎంపీటీసీ సభ్యురాలు గుజ్జెల విజయ, వైస్ సర్పంచ్ మాలిక్, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.చిరంజీవి, గణపతి పాల్గొన్నారు.

పక్కాగా స్వచ్ఛాంధ్ర అమలు


చింతపల్లిలో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్

చింతపల్లి: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని చింతపల్లి ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. ప్రతినెలా మూడో శనివారం ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమంలో భాగంగా చింతపల్లిలో పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. కార్యాలయాలతో పాటు పలు వీధులను శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్లలో ఆహార పదార్థాలు నిల్వ చేస్తే చర్యలు


రాజవొమ్మంగి బాలుర వసతి గృహం స్టాక్‌రూంలోని కూరగాయలను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఈశ్వరరావు

రాజవొమ్మంగి: వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఆహార పదార్థాలు నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో యాదగిరిఈశ్వరరావు వెల్ఫేర్ ఆఫీసర్లను హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం పలు ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను తనిఖీ చేశారు. స్థానిక బాలికల బీసీ హాస్టల్, ఆశ్రమ పాఠశాలలో వంట గది, స్టాక్ రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. శుద్ధమైన నీటినే ఉపయోగించాలని ఆదేశించారు. ఇటీవల ఒక హాస్టల్‌లో అధిక సంఖ్యలో విద్యార్థులు అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన సంగతి తెలిసిందే. దీనిని దృష్టిలో ఉంచుకొని అన్ని హాస్టళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు ఎంపీడీవో విలేకరులకు తెలిపారు. బూజు పట్టిన బెల్లం, చింతపండును వంటల్లో ఉపయోగించవద్దని చెప్పారు. కూరగాయలు నాణ్యతతో, తాజాగా ఉన్నాయా? లేదా? అని పరిశీలించారు.

కిలో టమాటా రూ.8

నష్టాలు చూసిన రైతులు


ముంచంగిపుట్టు వారపు సంతకు అధికంగా తీసుకువచ్చిన టమాటా

ముంచంగిపుట్టు: రైతులు పడ్డ శ్రమకు, కష్టానికి ఫలితం లేకుండా పోతోంది. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో శనివారం వారపు సంతకు తీసుకువచ్చిన టమాటాకు ధర భారీగా పతనమైంది. కిలో టమాటా రూ.8కు పడిపోయింది. దీంతో గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికంగా టమాటా వారపు సంతకు తీసుకురావడంతో కొనుగోలుదారులు లేకపోవడంతో టమాటాను తక్కువ ధరకు అమ్మాల్సి వచ్చిందని వాపోయారు. కొంత మంది రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూసినా కొనేవారు లేక తీవ్ర నిరాశతో టమాటాను బుట్టల్లో వేసుకుని ఇంటి బాట పట్టారు. రవాణా ఖర్చులు కూడా రాలేదని, ఈ ఏడాది టమాటా సాగు అధికంగా చేయడం, ధర పడిపోవడంతో నష్టపోయామని దొడిపుట్టు, వనభసింగి, పేటమాలిపుట్టు గిరిజన రైతులు తెలిపారు.

బోర్ల మరమ్మతులకు ప్రత్యేక ఆటో ఏర్పాటు


ఆటోను ప్రారంభిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

కొయ్యూరు: పాడైన బోర్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం బోర్ల మరమ్మతులు చేసేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఆటోను ప్రారంభించారు. బోర్ల గొట్టాలతో సహా అన్నీ ఈ ఆటోలో ఉంటాయన్నారు. వేసవి నేపథ్యంలో ఆటోలో వస్తువులు తీసుకెళ్లి బాగు చేస్తారన్నారు. ఎక్కడ బోర్లు పాడైనా నేరుగా సమాచారం చెప్పవచ్చన్నారు. తాగునీటి సమస్య నివారణకు వీలుగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

మంచినీటి బోర్ల మరమ్మతులకు చర్యలు


సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్‌ను పారంభిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు


మాట్లాడుతున్న ముంచంగిపుట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి

చింతపల్లి: మండలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా బోర్ల మరమ్మతులకు చర్యలు చేపడుతున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి గ్రామంలోను మరమ్మతులకు గురైన బోర్లను వెంటనే బాగుచేయడానికి సమ్మర్ క్రాష్ కోర్సును శనివారం ప్రారంభించారు. ఏ గ్రామంలో బోర్లు మరమ్మతులకు వచ్చినా గ్రామ సచివాలయానికి, మంచినీటి సరఫరా విభాగం అధికారులకు, మండల పరిషత్ కార్యాలయానికి సమాచారం అందించాలని ఎంపీడీవో కోరారు. ఈ కార్యక్రమం మార్చి 15వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: గ్రామాల్లో తాగునీటి బోర్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి తెలిపారు. మండల కేంద్రం ముంచంగిపుట్టులో శనివారం బోర్ల మరమ్మతుల ప్రక్రియకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గిరిజన గ్రామాల్లో తాగునీటి బోర్ల మరమ్మతులకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ విస్తరణ అధికారి చిన్నాన్న, పంచాయతీ కార్యదర్శులు సత్యరంజన్, ప్రవీణ్, బోరు మెకానిక్ రాజేంద్ర పాల్గొన్నారు.

ఔషధ మొక్కల సాగుకు జిల్లా అనుకూలం


మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి

చింతపల్లి: ఔషధ సుగంధ మొక్కల సాగుకు జిల్లాలో వాతావరణం అనుకూలంగా ఉందని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శనివారం చింతపల్లి పరిశోధనా స్థానంలో ఏపీ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ఆధ్వర్యంలో గిరిజన రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతపల్లి పరిశోధనా స్థానంలో సుమారు 100 రకాల వరకూ ఔషధ మొక్కలున్నాయన్నారు. ప్రతి మొక్కకూ ఒక విశిష్టత, ప్రత్యేక గుణాలు ఉంటాయన్నారు. వీటికి సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పించగలిగితే మన్యంలో రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఏపీ ఔషధ సుగంధ మొక్కల బోర్డు ఏడీ విజీషణ మాట్లాడుతూ మన్యంలో ఔషధ మొక్కలను సాగుచేసే రైతులకు అనేక ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉద్యాన శాస్త్రవేత్తలు బిందు, సందీప్‌నాయక్, రిటైర్డ్ డీఎఫ్‌వో జానకీరావు, ప్రతినిధులు శివకేశవరావు మాట్లాడారు. మన్యసీమ సంస్థ సీఈవో శ్రీనివాసరావు, ఏపీ ఔషధ సుగంధ మొక్కల బోర్డు సభ్యులు విజయ్‌కుమార్, దుర్గాప్రసాద్, కృష్ణశ్రీ, ప్రణీత, బోర్డు ప్రోగ్రాం అధికారి కల్యాణి, ఆయుష్ వైద్యాధికారి రఘు పాల్గొన్నారు.

'మన భవిష్యత్' కోసం ప్రచారం


వారపు సంతలో మన భవిష్యత్ కోసం అంటూ బ్యానర్‌తో యూనివర్స్..

ముంచంగిపుట్టు: మన భవిష్యత్ కోసం అంటూ అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువేలి నియోజకవర్గ కేంద్రానికి చెందిన విశ్వ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యూనివర్స్ శనివారం ముంచంగిపుట్టు వారపు సంతలో వినూత్న ప్రచారం చేశారు. బ్యానర్ పట్టుకొని తిరుగుతూ సందడి చేశారు. ప్రపంచంలో కుల, మతాలు ఎక్కడ కూడా లేకుండా రద్దు చేయాలని, ప్రపంచమంతా ఆయ దేశాల భూమిని జాతీయం చేయాలని, సైన్స్ సంస్కృతిని ప్రభుత్వాలు అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

తడిపొడి చెత్తతో సేంద్రియ ఎరువు

మాడుగుల: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. జయలక్ష్మి మాట్లాడుతూ తడి పొడి చెత్త వేరు చేయడం వల్ల సేంద్రియ ఎరువుగా తయారు అవుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఎం. రామ్‌కుమార్, తెలుగు ఉపన్యాసకులు పైడిరాజు, ఉపన్యాసకులు రాజు షర్మిలశ్రీ, నారాయణ, అప్పలనాయుడు, నాగేశ్వరావు, నాగేశ్వరావు, బోధనేతర సిబ్బంది సులేమాన్, శ్రీనివాసు పాల్గొన్నారు.